

నిజామాబాద్‌లో ఎమ్మెల్సీ కవితకు ఘనస్వాగతం పలుకుతున్న ప్రజలు, బీఆర్ఎస్ శ్రేణులు



తెలంగాణతల్లి విగ్రహానికి పూలమాల వేసిన అనంతరం నినదిస్తున్న ఎమ్మెల్సీ కవిత. చిత్రంలో మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి, ఎంపీ కేఆర్ సురేశ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు బిగాల గణేశ్, జీవన్‌రెడ్డి, గోవర్ధన్ తదితరులు

# మాది భయపడే బ్లడ్ కాదు

- కేసులు పెడితే బెదిరిటోళ్లం కాదు
- ఉద్యమాలు చేసి రాష్ట్రం తెచ్చినోళ్లం
- నిప్పులాంటి నిజామాబాద్ బిడ్డను..
- కాంగ్రెస్ పాలనలో నోరు తెరిస్తే పోలీసు కేసు
- తెలంగాణ తల్లి మాది.. కాంగ్రెస్ తల్లి మీది
- నిజామాబాద్ పర్యటనలో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత
- దారి పొడవునా అపూర్వ స్వాగతం

నిజామాబాద్, డిసెంబర్ 29 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): 'కేసీఆర్‌ను ఎదుర్కొనే దమ్ము, ధైర్యం లేక కేసీఆర్ బిడ్డలమైన రామన్న మీద, నా మీద కేసులు పెట్టే ప్రయత్నం చేస్తున్నారు. మాది భయపడే బ్లడ్ కాదు. భయపెట్టే బ్లడ్..' అని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత వ్యాఖ్యానించారు. 'ఎట్టి పరిస్థితుల్లోనైనా మేమెవ్వరికీ భయపడేది లేదు. మేము తప్పు చేయలేదు. నామీద, రామన్న మీద, బీఆర్ఎస్ నాయకులపై ఎన్ని కేసులు పెట్టినా.. నిప్పు కణికల్లా బయటికి వస్తాం..' అంటూ స్పష్టంచేశారు. 'ఎందుకు అయితున్నయి కేసులు ఇయ్యాలా? కేంద్రాన్ని ఎదురించి మాట్లాడితే కేసు. చైనా వాడు బార్డర్ దాటి లోపలికి వచ్చిండంటే కేసు. ప్రజలకు మంచి జరుగతలేదంటే కేసు. ముఖ్యమంత్రి పేరు మరిచిపోతే కేసు, రైతు తన భూమి ఇయ్యకపోతే కేసు, ఫేస్‌బుక్‌లో పోస్టు పెడితే కేసు, ట్విట్టర్‌లో ప్రొఫెసర్లు అభిప్రాయం చెప్తే కేసు, ఇన్‌స్టాలో అక్కాచెల్లెళ్లు వీడియో పెడితే కేసు..' అంటూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరును కవిత ఎండగట్టారు. ముఖ్యమంత్రికి గింత భయమెందుకు? నిజాన్ని ఫేస్ చేయలేరా? అని ప్రశ్నించారు. ఢిల్లీ లిక్కర్ కేసులో బెయిల్‌పై విడుదలైన అనంతరం నిజామాబాద్ జిల్లాకు తొలిసారిగా ఆదివారం కవిత వచ్చారు. ఈ సందర్భంగా 44వ నంబర్ జాతీయ రహదారి ఇందల్వాయి టోల్‌ప్లాజా దగ్గరి నుంచి నిజామాబాద్ నగరం వరకు కవితకు ఘన స్వాగతం లభించింది. బీఆర్ఎస్ శ్రేణులు, భారత జాగృతి నాయకులు, కవిత అభిమానులు దారి పొడవునా అపూర్వ స్వాగతం పలికారు. సుభాష్‌నగర్‌లోని ఉద్యమకాలం నాటి తెలంగాణతల్లి విగ్రహానికి పూలమాల వేశారు. అనంతరం అక్కడే ఏర్పాటు చేసిన వేదికపై ప్రజలనుద్దేశించి మాట్లాడారు. 'బరువు ఎత్తుకున్నోడు.. బాధ్యత ఉన్నోడు. ఓపికతో ఉండాలె. ప్రజలకు ఇబ్బంది ఉంటే పరిష్కారం చేస్తావనే బాధ్యత ఇచ్చారు. అల్లాటప్పాగా టైంపాస్‌కు అధికారం ఇయ్యరు. ఆ విషయాన్ని మరిచిపోయి ఎదురు మాట్లాడితే కేసులు పెడుతున్నరు' అని కవిత మండిపడ్డారు.

> కేసులు మమ్మల్ని భయపెట్టలేవు. ఉద్యమాలు చేసి తెలంగాణ తెచ్చినోళ్లం. గులాబీ పార్టీ వాళ్లం. గట్టిగా నిలబడతాం. ప్రజల పక్షాన కొట్లాడుతాం.
>
> -ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

## నిప్పులాంటి నిజామాబాద్ బిడ్డను...

ఎన్ని ఇబ్బందులు, కష్టాలు ఎదురైనా తాను నిప్పులాంటి నిజామాబాద్ బిడ్డను అని, పిడికిలి ఎత్తి అన్నీ ఎదురించి ఇక్కడికి వచ్చానంటూ ఎమ్మెల్సీ కవిత చెప్పారు. కష్టకాలంలో తనకు మద్దతు ఇచ్చినందుకు ప్రజలందరికీ వేదిక పైనుంచి భావోద్వేగంతో ధన్యవాదాలు తెలియజేశారు. సుభాష్‌నగర్‌లో తెలంగాణతల్లి విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన సభా ప్రాంగణానికి బతుకమ్మ, బోనాలు, గొంగడి, వలలు, గొర్రె పిల్లలతో భారీగా తరలి వచ్చిన అభిమానులను చూసి కవిత మురిసిపోయారు. దసరా లెక్క అనిపిస్తున్నదని, మిట్ట మధ్యాహ్నం ఎండ కొడుతుంటే వెన్నెల్లో నిల్చున్నట్టు, నవ్వుతుంటే మనసు పులకరిస్తున్నదని చెప్పారు. డిగ్రీ చదివినవారు పెద్ద సంఖ్యలో ఈ సభకు రాగా వారిని ఉద్దేశించి స్కూటీలు వచ్చాయా? అని కవిత ప్రశ్నించారు. రాలేదంటూ వారంతా చేతులు ఊపారు. ముఖ్యమంత్రికి తెలిసేలా చెప్పండి అని అనగానే రాలేదంటూ కేకలు వేశారు. తులం బంగారం వచ్చిందా? అని మహిళలను ప్రశ్నించగా రాలేదంటూ చేతులు ఊపారు. రూ.2,500 వచ్చినయా? మహాలక్ష్మి స్కీం వచ్చిందా? అంటే ఏమీ లేదంటూ మహిళా లోకం స్పందించింది. ఎన్నికల్లో మనసుకు ఏది వస్తే అది చెప్పారని, ఇప్పుడు ఏ ఒక్కటీ చేస్తలేరని మండిపడ్డారు. షాదీముబారక్‌లో రూ.లక్షతోపాటు తులం బంగారం ఇస్తామన్నారని, ఇప్పటివరకు ఏడాదికాలంగా కేసీఆర్ పైసలే ఇస్తున్నారని తెలిపారు. ఎన్నికలప్పుడు వచ్చే నెలలోనే ఇస్తామని చెప్పి ఇంత వరకు రూ.4వేలు పింఛన్ అమలు చేయట్లేదని దుయ్యబట్టారు.

> ఇటు సూర్యుడు అటు ఉదయించినా రాబోయే కాలమంతా గులాబీ శకమే. ఈ తీర్పును ఎవరూ మార్చలేరు. లోకల్‌బాడీ ఎన్నికల్లో, రాబోయే ఎమ్మెల్యే, ఎంపీ ఎన్నికల్లో గులాబీ జెండానే ఎగురబోతున్నది.
>
> -ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

## కాంగ్రెస్ ఫ్రెండ్లీ పోలీసులయ్యారు

కేసీఆర్ ఉన్నప్పుడేమో పీపుల్స్ ఫ్రెండ్లీ పోలీసింగ్ ఉండేదని, ఇప్పుడేమో కాంగ్రెస్ ఫ్రెండ్లీ పోలీసులయ్యారని కవిత ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ ఎమ్మెల్యే ఏకంగా పోలీసులను కొట్టినోళ్లను జగిత్యాల ఠాణా నుంచి తీసుకుని పోయారని చెప్పారు. రాష్ట్రంలో పోలీస్ జులుం నడుస్తున్నదని ఆరోపించారు. కేసీఆర్ హయాంలో నడిచిన మంచి పథకాలు కొనసాగించాలని కాంగ్రెస్ సర్కారును కవిత డిమాండ్ చేశారు. 'రైతుభరోసా ఎగ్గొట్టారు. రుణమాఫీ చేసినం అంటున్నరు. మనకు రాలేదు. పక్క ఇంటోడికీ రాలేదు. ఏ ఒక్కరికీ ఇందిరమ్మ ఇల్లు రాలేదు' అని మండిపడ్డారు. కేసీఆర్ గురుకులాలను ఏర్పాటుచేసి లక్షలాది మందిని చదివిస్తే గురుకులాలు నడపడం చేతకాని ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వమని విమర్శించారు. వీరి పాలనలో రాష్ట్రవ్యాప్తంగా 57 మంది పిల్లలు గురుకులాల్లో చనిపోయారని ఆవేదన వ్యక్తంచేశారు. కేసీఆర్ హయాంలో వచ్చిన నోటిఫికేషన్ ద్వారానే ఉద్యోగాలిచ్చి, అవన్నీ తామే ఇచ్చినట్టు చెప్పుకుంటున్నారని ఎద్దేవా చేశారు.

> నాడు కొలువు వచ్చినోళ్లకు ఇంటికి ఆర్డర్ కాపీ పోతుండేది. ఇప్పుడు చెప్రాసీ ఉద్యోగం నుంచి ఉన్నత ఉద్యోగమైనా ముఖ్యమంత్రే ఇస్తున్నడు. గతంలో ఏ ముఖ్యమంత్రి ఇలా చెయ్యలె. మభ్యపెట్టడానికి ఇలా చేస్తున్నరు. యువ మిత్రులు పిడికిలి ఎత్తి ఏడాదికి 2 లక్షల ఉద్యోగాలు అడగాలె.
>
> -ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

## చంద్రబాబు శిష్యుడు రేవంత్

చంద్రబాబు శిష్యుడు రేవంత్‌రెడ్డి అని కవిత వ్యాఖ్యానించారు. కార్మికులు, కర్షకులు, ఆటోవాలాలను కాంగ్రెస్ ప్రభుత్వం ఇబ్బందులకు గురిచేస్తున్నదని దుయ్యబట్టారు. ఉద్యోగులు తమతో గోడు వెళ్లబోసుకుంటున్నారని చెప్పారు. కేసీఆర్ ఉన్నప్పుడు 40% పీఆర్సీ పెంచారని, సమయానికి డీఏలు ఇచ్చారని గుర్తుచేశారు. కాంగ్రెస్ వచ్చినంక పెండింగ్ డీఏలు మంజూరు చేయడం లేదని మండిపడ్డారు. మహిళలకు ఫ్రీ బస్సును స్వాగతించామని, కానీ ఉచితం పేరుతో రద్దీకి అనుగుణంగా బస్సులు పెంచకపోగా బస్సుల సంఖ్యను తగ్గించారని, దీంతో ఎదురవుతున్నాయని పేర్కొన్నారు.

## కేంద్రంపై బీఆర్ఎస్ యుద్ధం: సురేశ్‌రెడ్డి

కేంద్ర కక్ష సాధింపు, రాష్ట్ర ప్రభుత్వం కుట్రలు పన్ని ఎన్ని కేసులు పెట్టినా ప్రజలంతా కవితమ్మతోనే ఉన్నారనే విషయం ఈరోజు రుజువైందని ఎంపీ కేఆర్ సురేశ్‌రెడ్డి పేర్కొన్నారు. ఏడాదిలోనే కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాదరణ కోల్పోయిందని విమర్శించారు. కొత్త సంవత్సరంలో కాంగ్రెస్ ప్రజా వ్యతిరేకతపై కవిత ఆధ్వర్యంలో ఉద్యమం నడుస్తుందని చెప్పారు. లోక్‌సభలో ఎంపీ లేకపోయినా, రాజ్యసభ ఎంపీలతో కేంద్రంపై బీఆర్ఎస్ యుద్ధం కొనసాగుతుందని స్పష్టంచేశారు. తెలంగాణకు న్యాయం జరగేలా పోరాటం చేస్తామని చెప్పారు. బీఆర్ఎస్ ఉంటేనే కేంద్రంలో, రాష్ట్రంలో మనకు లాభమని పేర్కొన్నారు. ఆరు గ్యారెంటీలతో మోసం చేసిన కాంగ్రెస్‌కు భవిష్యత్‌లో ప్రజలు ఆరు సీట్లకే పరిమితం చేయబోతున్నట్టు తెలిపారు.

## చేతగాని దద్దమ్మ రేవంత్: వేముల

ఇష్టమొచ్చిన మాటలు మాట్లాడుకుంటూ కాలం గడుపుతున్న చేతకాని దద్దమ్మ రేవంత్‌రెడ్డి అని మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి విమర్శించారు. కాంగ్రెస్‌పై ప్రజలకు నమ్మకం పోయిందని, స్థానిక సంస్థల్లో బీఆర్ఎస్ విజయం సాధించబోతున్నదని చెప్పారు. టీవీల్లో రేవంత్‌రెడ్డి కనిపిస్తే ప్రజలు చానళ్లను మార్చేస్తున్నారని, ప్రజలు అంతగా అసహ్యించుకునే పరిస్థితి ఏర్పడిందని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆశన్నగారి జీవన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు బాజిరెడ్డి గోవర్ధన్, బిగాల గణేశ్‌గుప్తా, జడ్పీ మాజీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు, మాజీ ఎమ్మెల్సీ వీజీ గౌడ్, బోధన్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆయేషా ఫాతిమా, నుడా మాజీ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, బీఆర్ఎస్ నిజామాబాద్ నగర అధ్యక్షుడు సిర్పరాజు, మాజీ జడ్పీటీసీ బాజిరెడ్డి జగన్ తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణతల్లిని వద్దంటున్నరు

'మన సంస్కృతికి నిలువుటద్దమైన తెలంగాణ తల్లిని వద్దంటున్నరు. హస్తం గుర్తు కలిగిన కాంగ్రెస్ బొమ్మను సెక్రటేరియట్‌లో పెట్టారు. ఆమెనే మనం మొక్కాలని చెప్తున్నారు. బతుకమ్మను పట్టుకున్న తల్లిని వద్దంటున్నరు. ఒప్పుకుందామా? మన తెలంగాణతల్లి మనకు కావాల్నా? వద్దా? అని ప్రజలను కవిత అడిగారు. తెలంగాణతల్లి మాదిరా... కాంగ్రెస్‌తల్లి మీదిరా... అంటూ గట్టిగా నినదించగా ప్రజలు సైతం కోరస్ అందుకున్నారు. మన సంస్కృతి మీద, పొట్ట మీద దాడి చేస్తున్న కాంగ్రెస్ సర్కారును ఎదిరిద్దామని పిలుపునిచ్చారు. నిర్బంధాలు ప్రయోగించినా భయపడేది లేదని స్పష్టం చేశారు. ఉద్యమంలో తొలి జడ్పీ పీఠాన్ని గెలిపించిన జిల్లా నిజామాబాద్ అని గుర్తుచేశారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఆ రుచి చూపిద్దామని పిలుపునిచ్చారు.

# చదువు దేవుడెరుగు.. మంచి అన్నం పెట్టలేరా?

- 'ఈ బువ్వ తినలేం.. మమ్మల్ని తీసుకెళ్లండి' అని పిల్లలు వేడుకొనే దుస్థితి వచ్చింది
- చేతగాని పాలన..గురుకులాలకు శాపం
- ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించాలి
- మాజీ మంత్రి హరీశ్‌రావు డిమాండ్



హైదరాబాద్, డిసెంబర్ 29 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ పాలనలో చదువు సంగతి దేవుడెరుగు, పిల్లలు ప్రాణాలతో బతికుంటే చాలని తల్లిదండ్రులు అనుకుంటున్నారని మాజీ మంత్రి హరీశ్‌రావు ఆవేదన వ్యక్తంచేశారు. 'ఈ బువ్వ మాకొద్దు, ఇక్కడ మేం ఉండలేం.. మమ్మల్ని తీసుకెళ్లండి' అని విద్యార్థులు తమ తల్లిదండ్రులను వేడుకొనే దుస్థితి ఎందుకు వచ్చిందని ఆదివారం ఒక ప్రకటనలో ప్రశ్నించారు. 'ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో గురుకులాల దీనస్థితిని చూస్తుంటే బాసర సరస్వతి తల్లి మనసు తల్లడిల్లుతున్నది. ఓవైపు నిర్మల్ జిల్లా దిలావర్‌పూర్ కేజీబీవీ పాఠశాలలో ఈ బువ్వ మేము తినలేం, మమ్మల్ని తీసుకెళ్లండి అని వేడుకుంటున్న విద్యార్థులు. మరోవైపు అనంతపేట కేజీబీవీ పాఠశాలలో విషాహారం తిని పది మంది విద్యార్థులు దవాఖాన పాలైన దుస్థితి. విషాహారం తిని వాంకిడి గురుకుల విద్యార్థిని మరణించిన ఘటన మరువకముందే ఇలాంటివి పునరావృతం కావడం సిగ్గుచేటు. ఒకప్పుడు గురుకులాల్లో సీట్ల కోసం క్యూ కట్టేవారు. ఇప్పుడు అదే గురుకులాల నుంచి ఇంటిబాట పట్టేందుకు విద్యార్థులు క్యూ కడుతున్నారు. కాంగ్రెస్ ఊదరగొట్టిన మార్పు ఇదేనా?' అని నిలదీశారు. 'కన్నబిడ్డల ఆవేదన చూడలేక తల్లిదండ్రులు గురుకులాలకు వచ్చి బిడ్డలను తోలుకపోతున్నరు. ఏడాదిలో మీ పాలన వైఫల్యానికి ఇంతకంటే నిదర్శనం ఏముంటుంది? రేవంత్‌రెడ్డీ?.. ముఖ్యమంత్రిగా, విద్యాశాఖ మంత్రిగా నువ్వే ఉండి భావి భారత పౌరుల భవిష్యత్తును ప్రశ్నార్థకం చేస్తున్నవు. మీ చేతగాని పాలన గురుకుల విద్యార్థులకు శాపంగా మారింది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి విద్యార్థుల ప్రాణాలను కాపాడేందుకు చర్యలు తీసుకోవాలి' అని హరీశ్ డిమాండ్ చేశారు.

# తిరుమలలో వివక్ష చూపొద్దు

- తెలంగాణ నేతల లేఖలు స్వీకరించాలి
- తెలంగాణ-ఆంధ్రా అన్న తేడా లేకుండా ఒకే విధానాన్ని అమలు చేయాలి
- మీడియాతో మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్



గద్వాలలో మీడియాతో మాట్లాడుతున్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

గద్వాల, డిసెంబర్ 29 : తిరుమల పుణ్యక్షేత్రంలో భక్తులు, రాజకీయ నేతలందరినీ ఒకేలా చూడాలని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. దేవుడి ముందు అందరూ సమానమేనని పేర్కొన్నారు. తెలంగాణ ప్రజాప్రతినిధుల సిఫారసు లేఖలను టీటీడీ స్వీకరించకపోవడం బాధాకరమని అన్నారు. ఆదివారం జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని జములమ్మను కుటుంబ సమేతంగా దర్శించుకొన్నారు. అనంతరం బీఆర్ఎస్ నేత బాసు హన్మంతు నాయుడి నివాసంలో మీడియాతో మాట్లాడారు. తిరుమలలో గతంలో ఉన్న సంప్రదాయాలను కొనసాగించడం లేదని ఆవేదన వ్యక్తంచేశారు. తిరుమలలో ప్రస్తుతం తెలంగాణ వాసులపై వివక్ష చూపుతున్నారని ధ్వజమెత్తారు. తిరుమలకు వెళ్లే వారిలో తెలంగాణ భక్తులే అధికమని చెప్పారు. గతంలో టీటీడీ కల్పించిన సౌకర్యాలను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఏపీ సీఎం చంద్రబాబు, టీటీడీ చైర్మన్ స్పందించి సిఫారసు లేఖలు స్వీకరించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. జోగుళాంబ దేవికి దసరా ఉత్సవాల సమయంలో కర్నూల్ కలెక్టర్ పట్టువస్త్రాలు సమర్పించేవారని.. తిరుమల ఉత్సవాల సమయంలో గద్వాల పట్టుపంచెలు స్వామికి సమర్పించడం ఆనవాయితీగా వస్తుందని తెలిపారు.







# కేసీఆర్ ముందుచూపుతోనే ట్రిపుల్ ఆర్

మొదటిపేజీ తరువాయి...

ఢిల్లీ నుంచి తీసుకొచ్చి వారితో అనేక సార్లు అలైన్‌మెంట్‌పై నాటి సీఎం కేసీఆర్ చర్చించారని గుర్తుచేశారు. అనేక చర్చల అనంతరం ఉత్తర భాగానికి చెందిన ట్రిపుల్ ఆర్ నిర్మాణానికి అనుమతులు లభించాయని తెలిపారు. దక్షిణభాగానికి సైతం కేసీఆర్ హయాంలోనే ప్రణాళికలు జరిగాయని, ఈలోపు ఎన్నికల కోడ్ రావడంతో ఆ ప్రతిపాదనలు ఆగాయని పేర్కొన్నారు. కానీ, కేసీఆర్ ప్రభుత్వం ఏమీ చేయలేదని రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఆరోపించడం తగదని హితవుపలికారు. ఆ మాటలు అనే అర్హత కోమటిరెడ్డికి లేదని, ఆయన వ్యాఖ్యలను ఖండిస్తున్నట్టు తెలిపారు. ముందున్న ప్రభుత్వాలు తలపెట్టిన పనులు కొనసాగించడం తదుపరి వచ్చే ప్రభుత్వ బాధ్యత అని, పంతాలకు పోకుండా నాటి ట్రిపుల్‌ఆర్ పనులను కొనసాగిస్తున్నందుకు సంతోషమని తెలిపారు. అదే సందర్భంలో ఉత్తరభాగం పనులకు టెండర్లు పిలువడంతోనే ఆపకుండా త్వరగా పూర్తిచేయడంతోపాటు దక్షిణభాగం పనులకు సంబంధించిన అనుమతులు కూడా తేవాలని డిమాండ్ చేశారు.


